క్లుప్తంగా

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

అశ్వారావుపేటరూరల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల కేంద్రంలో నేడు (శనివారం) నవోదయలో ఆరో తరగతి ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పి.కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో వివరిస్తూ.. నవోదయ ప్రవేశ పరీక్షకు మొత్తం 189 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా.. ఉదయం 11.30గంటల నుంచి 1.30గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరు కావాల్సిన విద్యార్థులు నిర్ణిత సమయానికి కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా



బస్‌పాస్‌లు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలో సర్పంచ్ తాటి సావిత్రి ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగులకు రాయితీపై బస్‌పాస్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ ఆర్టీసీ మణుగూరు డిపో సీఐ కనకదుర్గ మాట్లాడుతూ.. దివ్యాంగులు ఈ బస్ పాస్‌లతో 50శాతం రాయితీతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో ప్రయాణించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ దివ్యాంగుల బస్ పాస్ ఇన్‌చార్జ్ ఉపేందర్‌రావు, మాజీ సర్పంచ్ తాటి బిక్షం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు చంద్రుగొండలో..

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని పంచాయతీ కార్యాలయంలో దివ్యాంగులకు బస్‌పాస్‌లు పంపిణీ చేయనున్నట్లు కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సదరం సర్టిఫికెట్‌తోపాటు ఆధార్‌కార్డ్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, రూ.50లతో అర్హులైన దివ్యాంగులు రావాల్సిందిగా ఆయన కోరారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

అశ్వాపురం: గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని మొండికుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి అన్నారు. పంచాయతీలో శుక్రవారం డంపింగ్ యార్డులోని ఘన పదార్థాలైన ప్లాస్టిక్, సీసాలు, అట్టాలు విక్రయించారు. నర్సరీని, వైకుంఠధామంలో కాతకు వచ్చిన అరటిచెట్టు, పూల మొక్కలను సర్పంచ్ పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికీ నిర్మిస్తున్న ఇంకుడుగుంతలను పరిశీలించి నిర్మాణాలు వేగవంతం చేయించాలని సూచించారు. గ్రామంలో మిషన్‌భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుధీర్, వార్డు సభ్యుడు శివ, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని డి కొత్తగూడెం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఆదివాసీ మహిళా చైతన్య శక్తి ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసరాలు, వంట సామాన్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహిళా చైతన్య శక్తి మహిళలు వెంకటలక్ష్మి, అనసూయ, అరుణ, భారతి, కల్పన, అషాలత, సాయమ్మ, ధనలక్ష్మి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

అశ్వాపురం: అశ్వాపురం లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని జిల్లా 320ఈ గవర్నర్ తీగల కృష్ణమోహన్ అన్నారు. మండల కేంద్రంలో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం కృష్ణమోహన్ ప్రారంభించారు. మండల కేంద్రంలో జొన్నరొట్టెలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన బాణోత్ లక్ష్మణ్‌కు నాలుగు చక్రాల బండిని వితరణగా అందజేశారు. అశ్వాపురం గ్రామ పంచాయతీలో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రత్నాకర్, కమటం నరేష్, కోశాధికారి సర్వేశ్వరరావు, సుంకరి సురేందర్, గాదె కేశవరెడ్డి, ఒర్రె వీరభద్రం, వర్మ, పర్వత నరేష్, కొండలరావు, అశ్విని, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తెలుగుదేశం

దమ్మపేట: ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని శుక్రవారం మండల పరిధిలోని గుత్తవారిగూడెం, లచ్చాపురం గ్రామాల్లో నిర్వహించారు. నియోజకవర్గ నాయకులు కట్రం స్వామిదొర, వలీపాషా, నార్లపాటి శ్రీనివాసరావు, చరమల్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి రెండేళ్లు

- నాడు ఇసుక లారీలను పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది
- సీజ్‌చేసి నిల్వలుగా ఏర్పాటు
- రెండు సంవత్సరాలు గడిచినా వేలంకు వేళకాదాయే..
- మరోవైపు మట్టిగా మారుతున్న ఇసుక



సీజ్ చేసిన ఇసుక నిల్వలు

అన్నపురెడ్డిపల్లి: నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా ఇసుక నిల్వలు కనబడుతున్నాయి. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను పట్టుకునే అధికారులు వెంటనే వేలం వేయడం, లేదా ఫైన్ రూపంలో చలానా తీయించి ప్రభుత్వ ఖజానాకు నగదును జమచేయడం చేస్తుంటారు. కానీ ఇక్కడ ఒక్కటి కాదు, రెండు కాదు.. భారీగా టిప్పర్ లారీలతో తరలించి ఉన్న ఇసుక నిల్వలను అధికారులు వేలం వేయకుండా తాత్సారం చేస్తున్నారు. ఇసుకను సీజ్ చేసి రెండు సంవత్సరాలు గడిచినా.. ఇప్పటి వరకు వేలం వేయకుండా అధికారులు జాప్యం చేశారు.

అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం గ్రామ శివారులో సీతారామ కాలువ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా స్థానికంగా ప్రవహించే ఎదుళ్ల వాగు పైన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి వచ్చింది. దీంతో సంబంధిత కాలువ నిర్మాణ కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు వాగులో ఇసుక అడ్డుగా ఉందని, కాంట్రాక్టర్ క్యాంపు సమీపంలోని ఖాళీ స్థలంలోకి టిప్పర్ లారీలతో తరలించారు. విషయం తెలుసుకున్న కొంతమంది స్థానికులు టిప్పర్ లారీలను అడ్డుకుని స్థానిక తహసీల్దార్‌కు సమాచారం అందించారు. దీంతో సుమారు 40 టిప్పర్ లారీల ఇసుకను అధికారులు సీజ్ చేసి, ఇసుక నాణ్యత ప్రమాణాలపై మైనింగ్ అధికారులకు లిఖిత పూర్వంగా సమాచారం అందించారు. ఇసుక నిల్వలను సీజ్ చేసి రెండు సంవత్సరాలు గడుస్తోంది. ఇప్పటికీ రెవెన్యూ, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఖజానాకు గండి పడినట్లైంది. ఈ రెండు శాఖల మధ్య సమన్వయం లోపించడం వల్లే వేలం ఆలస్యమైందా..? పూర్తిగా నిర్లక్ష్యంతో ఉన్నారా? లేక అధికారులు లోపాయకార ఒప్పందాలకు లొంగారా? అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక నిల్వలపై తేల్చాలని కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం



సీజ్ చేసిన ఇసుకను వేలం వేయడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. సీజ్ చేసిన ఇసుక నిల్వ ఉండి రెండు సంవత్సరాలు కావొస్తుంది. ఎక్కువ శాతం ఇసుక మట్టిగా మారింది. ఇప్పటికైనా ఇసుక నిల్వలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– వెంకటరత్నం, సీపీఎం మండల కార్యదర్శి

ఖజానాకు గండి



సీజ్ చేసిన ఇసుకను వేలం వేయకుండా ఉండడం వల్ల ప్రభుత్వ ఖజానాకి గండి పడింది. సీజ్ చేసిన ఇసుక వేలం వేస్తే ప్రభుత్వ ఖజానాకి నగదు జమ అయ్యేది. అధికారుల నిర్లక్ష్యంతో ఇసుక నిల్వ మట్టిగా మారింది. ఇసుకపై చెట్లు పెరిగాయి.

– పెద్దారపు నాగరాజు, మర్రిగూడెం

ఉన్నతాధికారులకు నివేదించాం



ఇసుకను సీజ్ చేసిన వెంటనే ఉన్నతాధికారులకు నివేదించాం. అదేవిధంగా సీజ్ చేసిన ఇసుకలో మట్టి, ఇసుక శాతం కోసం మైనింగ్ అధికారులకు లిఖిత పూర్వకంగా సమాచారం అందించాం. అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– భద్రకాళి, తహసీల్దార్, అన్నపురెడ్డిపల్లి

అలజడులకు తావు ఇవ్వొద్దు



ఆదివాసీలతో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రహెమాన్

చంద్రుగొండ: అలజడులకు తావులేకుండా ప్రశాంత జీవనం సాగించాలని గొత్తికోయ ఆదివాసీలకు డీఎస్పీ అబ్దుల్ రహెమాన్ సూచించారు. మండలంలోని బెండాలపాడు, మద్దుకూరు గ్రామశివారుల్లోని ఎర్రబోడు, మంగళబోడు గూడేలను డీఎస్పీ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. కొన్ని నెలల క్రితం ఫారెస్ట్ రేంజ్ అధికారి చలమల శ్రీనివాసరావు గుత్తికోయల చేతిలో హతమైన విషయం తెలిసిందే. తాజాగా మద్దుకూరు అటవీప్రాంతంలో అటవీశాఖ అవుట్‌సోర్స్ వాచర్ రాములుకు చెందిన ద్విచక్రవాహనం గుర్తుతెలియని వ్యక్తులు దగ్గం చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో డీఎస్పీ ఆదివాసీల గూడేలను సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదివాసీలతో డీఎస్పీ మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని హెచ్చరించారు. కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సందర్భంగా డీఎస్పీ వెంట జూలూరుపాడు సీఐ వసంత్‌కుమార్, ఎస్ఐ గొల్లపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిర్మాణ పనులు నిలిపివేయాలి

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిబంధనలకు విరుద్ధంగా కొందరు స్థానికులు చేపడుతున్న ముత్యాలమ్మతల్లి, బొడ్రాయి నిర్మాణ పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, పద్మశాలిసేవా సంఘం, రజక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరు ఎంపీడీఓ వీరబాబుకు, ఎస్సై బట్ట పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. గతంలో ఈ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని అధికారుల సమక్షంలో మరోచోటుకు తరలించారని, ఇప్పుడు అదే స్థలం పక్కనే కొందరు స్థానికులు కొంముత్యాలమ్మతల్లి గుడి నిర్మాణానికి పూనుకున్నారని తెలిపారు. ఆ పనులను నిలిపివేసి, పార్క్ ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు బి.నరసింహారావు, ఉసికల కొండయ్య, హుస్సేన్, వెంకటేశ్వర్లు, ఎం.బాబురావు, ధర్మరాజుల శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన బీఆర్‌టీయూ

మణుగూరుటౌన్: బీఆర్‌టీయూ కార్మికుల పక్షాన నిలబడి పనిచేస్తుందని మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు అన్నారు. శుక్రవారం స్థానిక కిన్నెర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన లారీ లోడింగ్, అన్‌లోడింగ్ లెవలింగ్ కార్మికుల సంఘం బీఆర్‌టీయూ నాలుగో మహాసభలు నిర్వహించారు. ఆ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించిన జెడ్పీటీసీ.. కార్మికులకు స్థానిక ఎమ్మెల్యే, తెలంగాణ ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అండగా నిలుస్తారన్నారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బొగ్గు ముఠా యూనియన్ నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా నిరుడు రాంబాబు, కార్యదర్శి గడ్డమీద నర్సింహారావు, కోశాధికారి గోగుల యాదగిరిలను ఎన్నుకున్నారు. కత్తిరాము, దర్శనాల శ్రీనివాస్, తాతప్రసాద్, కార్మికులు చందర్, వీరారెడ్డి, ప్రవీణ్ కార్మికులు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పాటుపడతాం

మణుగూరుటౌన్: కార్మిక సమస్యల పరిష్కారం కోసం పాటుపడతామని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీని సందర్శించి అక్కడ కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్మికులకు ప్లేడేలు, పీహెచ్‌డీల కేటాయింపు అనంతరం తిరిగి సర్దుబాటుచేసి వెసులుబాటు లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోవలసి వస్తుందన్నారు. అదే విదంగా కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్మికులు తెలిపిన సమస్యలను గని అధికారులతోపాటు పై స్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రవూఫ్, నాయకులు కాపా శివాజీ, అశోక్, రామారావు, బాలాజీ, ముత్యం, పరిచూరి వేణుమాదవ్‌లు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీరయ్య, నాయకులు

దుమ్ముగూడెం: అకాల వర్షాల వల్ల నష్టపోయిన మిర్చి, వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలో పర్యటనలో భాగంగా కే లక్ష్మీపురం, సున్నంబట్టి, కేశవపట్నం, లక్ష్మీనగరం గ్రామాల్లో వర్షాలకు పాడైన పంట పొలాల్లోకి, కల్లాల్లోకి వెళ్లి పరిశీలించారు. ఆయా రైతులను పరామర్శించారు. కే లక్ష్మీపురంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రతాప్, వ్యవసాయాధికారి నవీన్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు, బైరెడ్డి సీతారామారావు, పిలక వెంకటరమణారెడ్డి, దర్శి సాంబశివరావు, కనుబుద్ది దేవా, సంగీతరావు, ఉబ్బ వేణు, కోడి చంటి, సమ్మయ్య, శివ, గుమ్మడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి ఘన సన్మానం



ప్రాజెక్ట్ మేనేజర్‌ను సన్మానిస్తున్న పీకేఓసీ అధికారులు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తూ శ్రీరాంపూర్ భూగర్భగని ఏజెంట్‌గా పదోన్నతి బదిలీపై వెళ్తున్న మాలోత్ రాముడును శుక్రవారం పీకేఓసీ అధికారుల బృందం పూలమలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వినాయకుని జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు దండమూడి రాంబాబు, దేవసాని శ్రీనివాస్, ఎం.లింగబాబు, జి.శంకర్, కల్యాణ్ రామ్, ఎస్.మధుసూధన్, కీర్తి సురేష్, రామ్‌శంకర్, నాగేంద్ర, వరుణ్, బాబ్జి, ఇంజనీర్లు సాయినాథ్, శ్రీనివాస్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ కార్మికుడికి..

సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ–2లో డంపర్ ఆపరేటర్‌గా పని చేసి ఈ నెల ఆఖరున పదవీ విరమణ చేస్తున్న కోపరి ప్రసాద్‌ను సహోద్యోగులు, అధికారులు శుక్రవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పీకేఓసీ డిప్యూటీ మేనేజర్ భూక్యా భాంగ్యా అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు బుడ్డి బాబ్జీ, సూపర్‌వైజర్లు కోడి శ్రీనివాస్, దేవేష్, సూర్య, కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులు పూజారి అర్జున్‌రావు, ఎం.శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు శంకర్, మేకల ఈశ్వర్, నాసర్‌పాషా, రిలే సి ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

చెలమ నీరే దిక్కు!



కుడుములపాడు వాగులోని చెలమ వద్ద తాగునీటి కోసం పడిగాపులుగాస్తున్న గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: వేసవి వచ్చేందంటే గిరిజన గ్రామాల్లో తాగునీటి గోస తప్పదు. గుక్కెడు తాగునీటి కోసం కాలినడకన రాళ్ల బాటలో వెళ్లి వాగులపై ఆధారపడాల్సిందే. గిరిజనం గొంతు తడవాలంటే చెలమ నీళ్ల కోసం కుడా పడిగాపులు పడాల్సి వస్తోంది. అశ్వారావుపేట మండలం కుడుములపాడు గిరిజన గ్రామంలో సుమారు 130 కుటుంబాలు ఉండగా, గ్రామంలో ఒక వాటర్ ట్యాంకుతోపాటు రెండు చేతి పంపులు ఉన్నాయి. ఈ గ్రామానికి మిషన్ భగీరథ పథకం ద్వారా గడిచిన మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోగా, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో స్థానికులు దాదాపు అర కిలోమీటరు దూరంలో ఉన్న వాగు వద్దకు వెళ్లి ఇసుకలో చెలమ తీసుకొని బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నారు. అధిక ఎండల నేపథ్యంలో చెలమలో కుడా నీళ్లు ఊరడం లేదని, దాంతో గంటల కొద్ది మండే ఎండలో పడిగాపులు కాసి బిందెలు నింపుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వారంతా అవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతి పంపుల ద్వారా కూడా నీళ్లు రావడం లేదని, దాంతో తామంతా వాగుపై ఆధారపడి దాహార్తి తీర్చుకుంటున్నామని గ్రామస్తులు చెప్పారు. ఈ సమస్యపై స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మి వివరణ కోరగా.. మిషన్ భగీరథకు సంబంధించిన పైపులైన్ మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరా నిలిచినట్లు తెలిపారు. కాగా మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్‌ను 'సాక్షి' వివరణ కోసం ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

నలుగురిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న ఆమె భర్తతో సహా నలుగురిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బి.రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. అశ్వారావుపేట మండలం పేరాయిగూడెంకు చెందిన హారికతో ఏపీలోని ఏలూరు జిల్లా కామవరపుకోటకు చెందిన కలబత్తుల వీరభద్రరావుకు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం కలగలేదు. దీంతో భర్తతో పాటు అత్త పెద్దిట్టు, ఆడపడుచు కనకరత్నం, బావ విశేశ్వరరావు దుర్భాషలాడుతూ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. దీనిపై హారిక ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఇరువర్గాల చేసుకున్న ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వినాయకపురానికి చెందిన పామర్తి చెన్నారావుపై ఆయన తల్లి మహేశ్వరి, తమ్ముడు శివ, చెల్లి భారతి ఈనెల 13న దాడి చేసినట్లు ఫిర్యాదు చేశాడు. అలాగే, చెన్నారావు, ఆయన భార్య దేవిమాళిక, మరదలు దుర్గాభవాని కలిసి తమ ఇంటిని ధ్వంసం చేసి దాడి చేసినట్లు మహేశ్వరి మరో ఫిర్యాదు చేసింది. దీంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

అమ్మవారికి పూజలు

అశ్వారావుపేటరూరల్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి 108 నదీ జలాలతో పంచామృతాభిషేకాలు చేసి, అనంతరం నూతన వస్త్రాలతో అలంకరించారు. పలు పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందించారు.

విద్యా సామగ్రి అందజేత

మణుగూరురూరల్: మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన సిద్ధంశెట్టి సరోజిని అనే విద్యార్థిని ఇంటర్మీడియట్ చదువు కోసం అవసరమయ్యే విద్యాసామగ్రిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ తీగల మోహన్‌రావు దంపతుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దండా రాధాకృష్ణ, క్లబ్ సభ్యులు పిళ్లారిశెట్టి హరిబాబు, భానుమతి, గాజుల పూర్ణచందర్‌రావు, నాగేశ్వరరావు, కె.చంద్రమోహన్, దుస్సా సమ్మయ్య, బేతంచర్ల వెంకటేశ్వరరావు, తార ప్రసాద్, మీరాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలు తరలిరావాలి

భద్రాచలంఅర్బన్: హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆ సంఘం భద్రాచలం పట్టణ కన్వీనర్ ఎంపీ నర్సారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం భద్రాచలం పట్టణంలోని రైస్మిల్ హమాలీ కార్మికులు, చెన్నుపాటి లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులతో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నర్సారెడ్డి పాల్గొని ప్రసంగించారు. నాయకులు నేకరికంటి నాగరాజు, పారేల్లి సంతోష్ తో పాటు హమాలీ కార్మికులు సాయి, శ్రీను, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమ్మెకు మద్దతు



అశ్వారావుపేటరూరల్: భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

భద్రాచలంఅర్బన్: వీఓఏలు చేపట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. దిశా ప్రొటెక్ట్ వెల్ఫేర్ ఫౌండేషన్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ మద్దెల అన్నపూర్ణ, వైస్ ప్రెసిడెంట్ పూజల లక్ష్మి, సెక్రటరీ నాగుల కుసుమ, జాయింట్ సెక్రటరీ ఇటుకల మాధవి, భద్రాచల నియోజకవర్గ జనరల్ సెక్రటరీ షమీమ్లు సమ్మెకు మద్దతు తెలిపారు. కార్మికులకు ఫ్రూట్స్, జ్యూస్‌లు అందజేశారు.

దుమ్ముగూడెం: ఐకేపీ వీఓఏల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం లక్ష్మీనగరంలో సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. మద్దతు తెలిపిన వారిలో టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గా ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లంక శ్రీనివాసరావు, నాయకులు బైరెడ్డి సీతారామారావు, పిలక వెంకటరమణారెడ్డి, దర్శి సాంబశివరావు, కనుబుద్ది దేవా, ఉబ్బ వేణు, కోడి చంటి, సమ్మయ్య, శివ, గుమ్మడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రామ దీపికల సమ్మెకు సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ శుక్రవారం పూర్తి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ భాస్కరరావు, గ్రామ దీపికల సంఘం నాయకులు ముదిగొండ మహలక్ష్మి, సఫియా, విజయ్, రాధ, సునీత తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో..

ములకలపల్లి: కళ్లకు గంతలతో శుక్రవారం వీఓఏలు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సంఘ జిల్లా అధ్యక్షురాలు దాసం కనకలక్ష్మి మాట్లాడారు. ఏఐటీయూసీ నాయకులు ఎండీ.యూసఫ్, ఎస్కె.షఫియా, ఏలూరి దుర్గ, మహాలక్ష్మి, సున్నం జ్యోతి, పెద్దులమ్మ, సత్యనారాయణ, విజయ్, సురేశ్ పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ..

అశ్వాపురం: వీఓఏలు మండల కేంద్రంలో భిక్షాటన చేసి తమ నిరసన తెలిపారు. దీక్షలకు అంగన్‌వాడీ టీచర్లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడారు. సంఘం జిల్లా కార్యదర్శి అరుణ, అధ్యక్షురాలు శ్రీలత, రమాదేవి, సత్యవాణి, కవిత, ముత్తయ్య, లత, సమ్మక్క, సుగుణ, వాణి, రాజకుమారి, సుజాత, గోవిందమ్మ, స్వరూప, వీఓఏలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: వీఓఏల సమ్మెలో భాగంగా శుక్రవారం వీవోఏలు బిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ బిక్షాటన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మహిళా నాయకురాలు పోలెబోయిన శ్రీవాణి ప్రారంభించి సమ్మెకు సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సీఐటీయూ నాయకులు నరసింహారావు, వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు సులోచన, కార్యదర్శి ఎస్.శ్రీనుగోపాల్, కోశాధికారి రమేష్, ఉపాధ్యక్షుడు రాయు, కమిటీ సభ్యులు చాందిని, రోజ, అరుణ, లీల, ధనలక్ష్మి, లలిత పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: వీవోఏలు చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, రింగ్ రోడ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో దుకాణాలకు వద్దకు వెళ్లి భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పిట్టల అర్జున్, వీవోఏలు ఎస్కే షాహిన్, భాగ్యలత, సుజాత, శివకుమారి, జయలక్ష్మి, బుజ్జి పాల్గొన్నారు.

పినపాక: తమ సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు మండల పరిధిలోని బయ్యారం క్రాస్ రోడ్‌లో షాపు షాపు తిరుగుతూ భిక్షటన చేస్తూ నిరసన తెలియజేశారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డుపై నిలుస్తున్న నీరు



మండల పరిధిలోని జగ్గారం తండా గ్రామం వద్ద మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై నీరు నిలిచి వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సైడ్ డ్రైయినేజీ లేక చిరు జల్లులు పడినా వర్షపునీరు, వృథా నీరు ప్రధాన రహదారిపై చేరుతోంది. ఆ నీరు అక్కడే నిలుస్తోంది. నిత్యం వాహనాలు రద్దీగా ఉండే రహదారి కావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం స్పందించి ప్రధాన రహదారిపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి: ఖాజాహుస్సేన్, పంచాయతీ కార్యదర్శి జగ్గారం
ఫోన్ నంబర్: 8500912845